

రాష్ట్ర స్థాయి పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న బాల బాలికలు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నీలకంఠేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బాలికల విభాగంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్య ప్రశ్నిస్తున్న ఎంపిసి మధు, 9వ తరగతి విద్యను అభ్యసిస్తున్న జాస్మిన్, బాలుర విభాగంలో రిషిత్ 9వ తరగతి, గోపికృష్ణ 9వ తరగతి విద్యార్థులు సెప్టెంబరు 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల పీడీ నీలకంఠేశ్వరరావు, ప్రిన్సిపల్ లీలా శ్రీహరి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యుత్‌తో పాటు క్రీడల్లో కూడా అద్భుత ప్రతిభ కనబరిచిన కూడా పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, పీడీ

కదంతొక్కిన కార్మికులు

- సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా
- రాజకీయ వేధింపులు, బెదిరింపులు ఆపాలి
- ఉద్యోగ భద్రత కల్పించాలి
- స్థానిక కూటమి నేతలను కట్టడి చేయాలంటూ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా కూటమి నేతల రాజకీయ వేధింపులను నిరసిస్తూ స్కీం వర్కర్లు రాయచోటి కలెక్టరేట్ ఎదురుగా సోమవారం కదంతొక్కారు. ఉద్యోగ భద్రతకై నినదించారు. రాజకీయ కారణాలతో తొలగించిన వారిని బేషరతుగా విధులలోకి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు ఆపడంతోపాటు స్థానిక కూటమి నేతలను కట్టడి చేయాలంటూ నినదించారు. కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్‌ఒకు అందజేశారు. ధర్నానుద్దేశించి సిఐటియు నాయకులు మాట్లాడుతూ చిన్నమండెం, రామా పురం, గాలివీడు, సంబేపల్లి, కలకడ, కెవిపల్లి, తంబళ్లపల్లి మండలాల్లో చిరుద్యోగులైన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్, వెలుగు యనిమేటర్లను రాజీనామాలు చేయాలని తీవ్రమైన రాజకీయ వత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కూటమినేతలు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి నేడు అధికారంలోకి రాగానే ఉద్యోగులను తొలగిస్తూ జగన్ అడుగుజాడల్లోనే నడుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగులను మార్చడానికి రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని వాపోయారు. అంగన్వాడీ కార్యకర్త వేధింపులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

తాళలేక ఆత్మహత్యాయత్నం చేస్తే కనీసం పరామర్శించటం లేదని, మహిళలు అంటే బాధ్యత లేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పదవి ముగియగానే రూ.50 వేలు పెన్షన్ ఇచ్చినట్లుగా, ఉద్యోగులకు కూడా రూ.25 వేలు పెన్షన్ ఇస్తే రాజీనామాలు చేయడానికి సిద్ధమేనని తెలిపారు. రాజకీయ వేధింపులపై స్థానిక ఎమ్మెల్యేలను కలుస్తుంటే పరిష్కరించాల్సిందిపోయి కార్యకర్తల ద్వారానే తాము గెలిచామని చెప్పుకోవడం ప్రజా తీర్పును అవహేళన చేయడమేనన్నారు. స్థానిక కూటమి నాయకులను కట్టడి చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా దీర్ఘకాలిక ఉద్యమాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. ఉన్నత విద్యాసంస్థల వైస్‌ఛాన్స్‌లర్లు, ఐఎఎస్, ఐపిఎస్, పోలీసు ఉన్నత అధికారులకు సైతం ఈ రాజకీయ వేధింపులు తప్పడంలేదని, ఇలాగే కూటమి నేతల వైఖరి కొనసాగితే ప్రజల్లో వ్యతిరేకత తప్పదని వెల్లడించారు. రూ.20 లక్షల ఉద్యోగాలసిస్తామని ఉన్న ఉద్యోగాలు తీసేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం రాజకీయ కారణాలతో తొలగించిన ఉద్యోగులను విధులలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు కోశాధికారి టి.హరిశర, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.జయమ్మ, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి, ఎపి వెలుగు, విఒఎ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాణి, రెడ్డెప్ప, సిఐటియు జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, అంగన్వాడీ సంఘం నాయకులు సిద్ధమ్మ, రమణమ్మ, మధురవాణి, విజయ, ఈశ్వరమ్మ, సుకుమారి, లక్ష్మీదేవి, రమణమ్మ, జ్యోతి, ఆశా సంఘం నాయకులు పామిద, విఒఎ సంఘం జిల్లా కోశాధికారి సుబ్రహ్మణ్యం, రెడ్డెప్పరెడ్డి, కృష్ణమ్మ పరంజ్యోతి, రెడ్డెప్ప, మధ్యాహ్న భోజన సంఘం నాయకులు రమేష్, శ్రీరాములు, పంచాయతీ వర్కర్స్ లీడర్ శేఖర్ నాయక్, హమాలీ సంఘం మాధవయ్య పాల్గొన్నారు.



డిఆర్‌ఒ సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుతం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో కలెక్టర్ల సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధకం, అటవీ, మైనింగ్, నీటి వనరులు, పరిశ్రమలు, చేనేత, మౌలిక సదుపాయాలు, పెట్టుబడి, ఇంధనం, ఆర్అండ్‌బి, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆరోగ్యం, మున్సిపల్ పరిపాలన, పిఆర్, గృహ నిర్మాణం, పర్యాటకం, సమాచార సాంకేతికత, రెవెన్యూ, ఎక్సైజ్ తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సదస్సుకు వెలగపూడి సచివాలయంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాల్గొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటి విసి హాల్ నుంచి జెసి ఆదర్శ్ రాజేంద్రన్, అన్ని శాఖలు జిల్లా అధికారులు పాల్గొ న్నారు. విసి అనంతరం జెసి అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేసిన దిశ నిర్దేశం మేరకు జిల్లా అధికారులందరూ కార్యాచరణను రూపొందించుకొని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల ఆదాయాన్ని పెంచాలన్నారు. అన్ని రంగాల్లో జిల్లా మొదటి స్థానంలో ఉండాలన్నారు. ఉచిత ఇసుక పాలసీ, హౌసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విసిలో పాల్గొన్న జెసి ఆదర్శ్ రాజేంద్రన్

కళాశాలల్లో కనీస వసతులు కల్పించాలి : ఎస్ఎఫ్ఐ



డిఆర్‌ఒ సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి డిమాండ్ చేశారు. సోమవారం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక డిఆర్‌ఒ సత్యనారాయణకు అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఆర్ఐఒ కృష్ణప్పకు విద్యార్థినుల సమస్యలు అనేక తెలియజేసినప్పటికీ ఒక్కసారి కూడా కళాశాలలను తనిఖీ చేసిన దాఖలాలు లేవన్నారు. వెంటనే ఆర్ఐఒను సస్పెండ్ చేయాలని ఓని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కనీసం మరుగుదొడ్లు నిర్మాణం పూర్తి కాక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రభుత్వ హైస్కూల్లో ఉన్న మరుగుదొడ్లు వాడుకోవడం ద్వారా అక్కడ ఉన్న విద్యార్థులకు సరిపోక వారు కూడా ఇబ్బంది ఎదుర్కొంటున్నారని చెప్పారు. విద్యార్థినులు మరుగుదొడ్లు వాడుకోవడానికి కనీసం నీటి సౌకర్యం కూడా లేదన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శానిటరి ప్యాడ్స్ బర్నింగ్ మిషన్ ఉన్నప్పటికీ విద్యార్థులకు అవగాహన కల్పించకుండా నిరుపయోగంగా పక్కన పెట్టారని అన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రిన్సిపల్ ఏమాత్రం పట్టించుకోలేదని వాపోయారు. ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించాలని అన్నారు. శిబ్యాల పంచాయతీ ఆదర్శ పాఠశాలలో డొక్క సీతమ్మ భోజనం పథకం నాణ్యత లేక విద్యార్థులు ఆకలితో అలమటిస్తూ చదువుతున్నారని చెప్పారు. విద్యార్థులు ఇంటిని నుంచి మధ్యాహ్న భోజనం తీసుకొచ్చుకొని అక్కడే తింటూ ఉన్నారని చెప్పారు. జిల్లా విద్యాశాఖ అధికారుల కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీలు విషయంలో పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. ఆర్ఓ ప్లాంట్ ఉన్నప్పటికీ నిరుపయోగంగా ఉందన్నారు. తాగు నీటి ట్యాంక్ అపరిశుభ్రంగా పాచి పట్టి ఉండడం వల్ల విద్యార్థినులు ఆ నీటిని తాగి అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డొక్కా సీతమ్మ భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని, విద్యార్థులకు ఇస్తున్న కోడి గుడ్లను ముందే వేరేవారికి ఇచ్చి మిగిలిన వాటిని విద్యార్థులకు ఇచ్చేటువంటి పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి సమస్యల పైన విద్యార్థులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయ పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. కొంతమంది విద్యార్థులు భోజనం బాగాలేదని అడిగితే ఉపాధ్యాయులు సిబిఎస్‌సి ద్వారా 20 మార్కులు తమ చేతిలో ఉన్నాయని, మిమ్మల్ని ఫెల్ చేస్తామని విద్యార్థులను మానసికగా భయభ్రాంతులను గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కళాశాలలోని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నరేష్, చందు, గురునాథ్, విష్ణు పాల్గొన్నారు.

త్వరితగతిన ప్రజా సమస్యలు పరిష్కరించాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను బాధ్యతాయుతంగా పరిష్కరించాలని డిఆర్‌ఒ సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒతో పాటు కలెక్టరేట్ ఎస్‌డిసి రామసుబ్బయ్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి అందిన సమస్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీలోని అంశంపై దృష్టి పెట్టి, క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవాలను పరిశీలించి, విచారణ చేసి పారదర్శకతతో నాణ్యతగా సమస్యలను పరిష్కరించాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ పరిధిలోకి వెళ్లకుండా నిర్ణీత కాల వ్యవధిలోపు నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. పెండింగ్ దరఖాస్తులు రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న డిఆర్‌ఒ సత్యనారాయణ

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక సాయి చిత్ర థియేటర్ వీధిలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పరిరక్షిస్తే ప్రకృతే మనందరిని రక్షిస్తుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ తక్షణ కర్తవ్యంగా పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రత మన ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయని తెలియజేశారు. విద్యుత్, ఆహారం, నీటి వాడకాన్ని తగ్గించాలని, ప్లాస్టిక్‌ను విడనాడాలని పిలుపునిచ్చారు. మానవుని జీవన శైలిలో మార్పు వచ్చినప్పుడే వాతావరణం బాగుంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షింస్తూ ఉంటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టిడిపి నాయకులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా



రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి కొండయ్య నాయుడు

నేరాల నియంత్రణకు చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-ములకలచెరువు

సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణకు పట్టిష్ట చర్యలు చేపడుతున్నట్లు మదనపల్లె డిఎస్‌పి కొండయ్య నాయుడు అన్నారు. సోమవారం ములకలచెరువు సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఎటువంటి నేరాలు దొంగతనాలు జరగకుండాచూసుకోవాలని తెలిపారు. రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని చెప్పారు. పిటిషన్ దారులకు ఎప్పటికప్పుడు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా మదనపల్లి డివిజన్‌కు డిఎస్‌పిగా రావడంతో ములకలచెరువు సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించిన కొండయ్య నాయుడును జనసేన పార్టీ తంబళ్లపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పోతుల సాయినాథ్, మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ పాలగిరి సిద్దయ్య, తమ కార్యకర్తలతో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సిఐ తమ్మిశెట్టి మధు, ఎస్ఐ తిప్పేస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మండలంలోని చింతపర్తి జయారెడ్డివీధిలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్ స్తంభం పైభాగం విరిగిపోయి ఉండడంతో విద్యుత్ తీగలు కిందకి వేలాడుతున్నాయి. దీంతో జెసిబి, ఇతర పెద్దపెద్ద వాహనాలు వెళ్తే విద్యుత్ తీగలు తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉందని నివాస ప్రజలు భయ భ్రాంతులకు గురవు తున్నారు. ఫిర్యాదు చేసినా పట్టిం చుకోలేదని వాపో తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, విద్యుత్ పోల్‌కు మరమ్మతులు చేపట్టి, విద్యుత్ తీగలుపైకి అమర్చాలని నివాస ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం, తీగలు

ఆందోళనలను విజయవంతం చేయాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మదనపల్లి సబ్-కలెక్టర్ కార్యాలయంలో భూ రికార్డులు తగలబెట్టిన వారిని తీక్షణమే అరెస్టు చేయాలని, భూ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఆగస్టు 12న జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నరసింహులు కోరారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో జిల్లా వ్యాపితంగా అనేక భూ కుంభకోణాలు పేదల భూములు ఆక్రమణకు గురైయ్యాయని, పేదలపై దాడులు చేశారని పేర్కొన్నారు. మదనపల్లి నియోజకవర్గంతో పాటు తంబళ్ళపల్లి, పీలేరు నియోజకవర్గాల్లో భూ కుంభకోణాలు బయటపడతాయనే కారణంతోనే మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో భూ రికార్డులు తగలబెట్టారని చెప్పారు. అలాంటి వారికి సహకరించిన అవినీతి రెవెన్యూ అధికారులపై పోలీసులు కేసులు నమోదు చేసి వారిని అరెస్టు చేయాలని, జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో భూ రికార్డులకు రక్షణ కల్పించాలని కోరారు. రెవెన్యూ భూ బాధితుల సమస్యలు పరిష్కారం కోసం జిల్లా వ్యాపితంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించే ఆందోళనలలో రెవెన్యూ భూ బాధితులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐజిల్లా కార్యవర్గ సభ్యులు తోపు కృష్ణప్ప, సాంబశివ, సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, విశ్వనాథ నాయక్, సుధీర్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, సిద్దయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత డిఎస్‌సి కోచింగ్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో గిరిజనులు బిఇడి, డిఇడి పూర్తి చేసి టెట్‌లో ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగలకు డిఎస్‌సి కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి పి.తేజస్విని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెట్‌లో ఉత్తీర్ణత చెందిన గిరిజన సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు డిఎస్‌సిలో కోచింగ్‌తోపాటు భోజనం, వసతిని తిరుపతిలో కల్పిస్తున్నామన్నారు. అభ్యర్థుల వయసు, ఇతర అర్హతలు విద్యాశాఖ వారి నిభందన మేరకు కలిగి ఉండాలన్నారు. నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు వారి పూర్తి బయోడేటతో పాటు వారి విద్యార్హత, కులధృవీకరణ పత్రం, రేషను కార్డు, ఆదారు కార్డు, పాస్‌పోర్టుసైజ్ కలర్ ఫొటోతోపాటు బిఇడి, డిఇడి, టెట్ కోర్సులలో ఉతీర్ణత సాధించిన ధృవీకరణ పత్రం నకలులను గెజిటేటు అధికారి వారిచే ధ్రువీకరించి సర్టిఫికెట్లు జత చేసి పంపాలన్నారు. ఈనెల 12న కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన సంక్షేమం, సాధికారిత అధికారి వారి కార్యాలయం, మైనారిటీ బాలికల వసతిగృహ భవనంలో సాయంత్రం ఐదు గంటలలోపు సమర్పించాలన్నారు.

జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలోనే పనిచేస్తూ 50 ఏళ్లు నిండిన జర్న లిస్టులు ఒకొక్కరికి రూ. 10 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలని అమరావతి అక్రిడిటెడ్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్. జైనుల్లా ఆబెద్దీన్ బాస అలియాస్ అభినయ్ కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిదని, వారి సంక్షేమ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడాలని చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే ఇతర రాష్ట్రాలలో జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం అమలు అవుతుందని ఈ విధంగా పరిశీలనకు మన రాష్ట్రానికి చెందిన అధికారులకు పంపాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి కోరారు. అవసరమైతే అధికారులతో పాటు జర్నలిస్టు సంఘాల నాయకులను జత చేసి పంపాలన్నారు. జర్నలిస్టుల విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులు కూటమి ప్రభుత్వం చేయకుండా అక్రిడేషన్ కమిటీల్లో సభ్యులుగా ఉన్న ప్రభుత్వ అధికారులను తొలగించి వారి స్థానంలో జర్నలిస్ట్ సంఘాల సభ్యులను, కనీసం 50 సంవత్సరాలు నిండి అక్రిడేషన్లు ఉన్న జర్నలిస్టులను ఆ స్థానం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

మరుగుదొడ్ల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు బస్టాండ్‌లోని మరుగుదొడ్ల సమస్యకు పరిష్కారం లభించింది. కొన్ని రోజులుగా మూతపడిన మరుగుదొడ్లను అధికారులు తెరిపించారు. 'బస్టాండ్‌లో మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలి' అనే శీర్షికన ఈనెల 3న ప్రచురించిన కథనానికి స్పందించారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు, కండక్టర్లు పడుతున్న అవస్థలను కథనంలో వివరించడంతో స్పందించిన ఆర్‌టిసి అధికారులు మోటర్‌కు మరమ్మతుల చేయించి మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించి తెరిపించారు. భవిష్యత్‌లో ఇటివంటి సమస్య పునరావృతం కాకుండా అధికారులు చూసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండ్‌లో తెరుచుకున్న మరుగుదొడ్లు

తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం : సిడిపిఒ



రైల్వేకోడూరు : పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిడిపిఒ, సిబ్బంది

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని ఐసిడిఎస్ సిడిపిఒ టిపి.సౌభాగ్యమ్మ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని సెట్టిగుంట, కోడూరు సెక్టార్లలో ఓబులవారిపల్లె అంగన్వాడీ కేంద్రాలలో సిడిఒఒ సూపర్వైజర్లు ఎం.గుణవతి, కె.యశోద ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు ముర్రుపాల యొక్క ప్రాముఖ్యతను గురించి వివరిం చారు. బిడ్డకు తల్లిపాలను ఇవ్వడం వలన తల్లికి బిడ్డకు కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు** : సంపూర్ణ ఆరోగ్యమని మండల వైద్యాధికారి డాక్టర్ శరత్ కమల్ పేర్కొన్నారు. మండలంలోని పాటూరు గ్రామ పరిధిలోని ఎస్.టి.కాలనీ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీ కార్యకర్తలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటనారాయణ, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **పుల్లంపేట** : తల్లి పాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అంగనవాడీ సూపర్వైజర్ మణెమ్మ అన్నారు. రామాపురం అంగన్వాడీ స్కూల్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమములో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** పుట్టిన బిడ్డ నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలను ఇవ్వడం వలన బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి డాక్టర్ శ్రీవిద్య అన్నారు. మండలంలోని కూరపర్తిలో 104 వైద్య శిబిరంతో పాటు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు కల్తీలేనివని, శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వలన అంటువ్యాధులు సోకకుండా ఆరోగ్యంగా జీవిస్తారన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుధాకర్, మహమ్మద్ రఫీ, సౌజన్య, ధనలక్ష్మీ, గ్రామస్థులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సిద్విక్

37 మందికి కంటి వైద్య చికిత్సలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని రెడ్డివారిపల్లెలో సర్పంచ్ నూతనకాల్వ రెడ్డమ్మ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మదనపల్లె ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి అడ్మిన్ అధికారి కోటయ్య ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెడ్డివారిపల్లి గ్రామంలోని ప్రజలకు, వయోవృద్ధులకు కంటి వైద్య పరీక్షలు ఉచితంగా అందించాలన్న ఆకాంక్షతో మదనపల్లె ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కంటి వైద్య శిబిరంలో 37 మందికి చికిత్సలు అందించినట్లు వైద్యులు డాక్టర్ సిద్విక్ తెలిపారు. 19 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేయగా, 11 మందికి నిమ్మనపల్లెలోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రిలో కంటి అద్దాలను అందించనున్నట్లు తెలిపారు. దృష్టిలోపాలను అధిగమించడానికి ప్రజలు పోషకాహారమైన పాలు, పండ్లు, ఆకుకూరలు తరచూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారప్ప, ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి అడ్మిన్ కోటయ్య, డాక్టర్ సిద్విక్, ఎఫ్ఎస్ఒ కొమ్ము వెంకటేష్, శ్రావణి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్లు

ప్రజాశక్తి-రాయచోటి


తహశీల్దార్ పుల్లారెడ్డి

రాయచోటి మండల తహశీల్దారుగా వి.పుల్లారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రైతుల భూ సమస్యలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి, వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గతంలో ఉమ్మడి కడప జిల్లాలో పలు ప్రాంతాలలో విధులు నిర్వహించానని తెలిపారు. నూతనంగా వచ్చిన తహశీల్దారును పలువురు సన్మానించారు.


తహశీల్దార్ ఖాజాబీ

మదనపల్లె: మండల తహశీల్దార్‌గా ఖాజాబీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రమాదేవి తిరిగి అనంతపురం జిల్లాకే బదిలీ అయ్యారు. ఖాజాబీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఖాజాబీకి రెవెన్యూ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనం తరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను మర్యాద పూర్వకంగా కలిసి స్వీట్ బాక్స్ అందజేశారు.


తహశీల్దార్ ధనుంజయులు

నిమ్మనపల్లె : మండల తహశీల్దార్‌గా కె.ధనుంజయులు బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా నుంచి నిమ్మనపల్లికు బదిలీపై వచ్చిన ఆర్.బాలా జీరాజు తిరిగి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. కలెక్టరేట్‌లో ఉన్న ధనంజయులును తహశీల్దార్‌గా నియమించారు. డిప్యూటీ తహశీల్దార్ తపస్విని, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, సర్వేయర్లు, వీఆర్‌ఒలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలోని భూ సమస్యలను పరిష్కరించడానికి, రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు చేపడతామన్నారు. రెవెన్యూ సిబ్బంది చట్ట ప్రకారం తమ విధులను నిర్వహించాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అంకితభావంతో పనిచేయాలని సూచించారు.


తహశీల్దార్ భీమేశ్వరరావు

పీలేరు: మండల తహశీల్దారుగా మల్లంపల్లి భీమేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎన్నికల విధుల్లో భాగంగా వైయస్ఆర్ కడప జిల్లా, సింహాద్రిపురం మండల తహశీల్దారుగా పనిచేసి బదిలీపై పీలేరు మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా సత్వరం స్పందిస్తామన్నారు. విద్యార్థులకు ధ్రువపత్రాలతో పాటు రైతుల భూ సమస్యలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్లు సుబ్రహ్మణ్యం, విజయరెడ్డి, ఎవిఎస్ రామ్మోహన్, ఆర్ఐ చాణిక్య, వీఆర్ఒలు సురేష్‌రెడ్డి, ఎర్రయ్య, శిల్ప, కవిత, వీఆర్ఏలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - రాయచోటి: అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి టిడిపి మండల మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు. సోమవారం పవిత్ర శ్రావణమాసం సందర్భంగా కొత్తపేట శివాలయంలోని దేవాలయంలో అన్నదాత ఏనుగుల విశ్వనాథ, ధర్మకర్త వీరయ్య ఆహ్వానం మేరకు సుగవాసి ప్రసాద్ బాబు విచ్చేశారు. ఆయ నకు అర్చకులు ప్రత్యేక పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ పురం వీరయ్య, ఏనుగుల విశ్వనాథ ప్రసాద్ బాబుకు ఘనమాల వేసి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సుగవాసి శ్రీనివాసులు, మస్తాన్ రామాంజనేయులు, గోరంట్ల బిసిరెడ్డి, స్వామి, నాగార్జున, పసుపులేటి నాగేంద్ర, బడిబిడి రవి, సాయిరాం రాజు, నాగేంద్ర, ఆఫ్రోజ్, చిన్నక్క నాయుడు, శివప్రవీణ్ రాజు, వాకా వాసు, జనార్దన్, సురేంద్ర పాల్గొన్నారు.


పేదలకు అన్నం వడ్డిస్తున్న ప్రసాద్‌బాబు

రసవత్తరంగా క్రికెట్ మ్యాచ్‌లు


తలపడుతున్న కృష్ణా, శ్రీకాకుళం జట్లు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్ - 19 గ్రూప్ -బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం కెస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 91.1 ఓవర్లలో 347 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని ఆర్.రోహిత్ 76, చేతన్ రెడ్డి 72, గురు చరన్ 70, ప్రణవ్ కుమార్ రెడ్డి 66 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని ఎస్. ఎస్. హమీద్ బౌలింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 23.4 ఓవర్లు వేసి అందులో 5 ఓవర్లు మేడిన్ వేసి 83 పరుగులు ఇచ్చి 9 వికెట్లు తీసుకొని రికార్డ్ సృష్టించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట మూసే సమయానికి 1.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది. **మొదటి మ్యాచ్‌లో 219 పరుగులకు కృష్ణా జట్టు ఆల్ అవుట్ ..** వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 71.1 ఓవర్లలో 219 పరుగులకు కృష్ణా జట్టు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని ధనుష్ 62, వరుణ్ సాత్విక్ 34, భాను వరప్రసాద్ 34 పరుగులు చేశారు. శ్రీకాకుళం జట్టులోని పూర్ణ 4, సుశాంత్ 2 టికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయంలో 12.5 ఓవర్లలో 2 వికెట్లను స్థానికి 34 పరుగులు చేసింది. **మొదటి ఇన్నింగ్స్‌లో వెస్ట్ గోదావరి 262/10..**కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో వెస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 54.4 ఓవర్లలో 262 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రక్షణ్ 50, యశ్వంత్ 42 (నాట్ అవుట్) పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని సాయి దొరబాబురెడ్డి అద్భుతంగా బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 34.0 ఓవర్లలో మూడు వికెట్లను స్థానిక 99 పరుగులు చేసింది. ఆ జట్టులోని హర్ష సాయి రెడ్డి 55 (నోట్ అవుట్) పరుగులు చేశారు. వెస్ట్ గోదావరి దగ్గర్లో ని యశ్వంత్ రెండు వికెట్లు తీసుకున్నాడు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నియోజకవర్గ వ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు తెలియజేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సబ్ కలెక్టర్ వైఖోమ్ నిధియా దేవిని సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాధికాలంగా దళితులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనక పడ్డారన్నారు. పాలకులు మారినా, ప్రభుత్వాలు మారినా దళితుల జీవితాలలో వెలుగు రాలేదని ఆవేదన చెందారు. నేటికీ 70 శాతం దళితులు దినసరి కూలీలుగానే బ్రతుకు సాగిస్తున్నారని తెలిపారు. పేద, బడుగు, బలహీనవర్గాల పక్షపాతైన నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో దళితుల సంక్షేమానికి పెద్దపీట వేయనున్నారని తెలిపారు. పాలకులతోపాటు అధికార యంత్రాంగం కూడా చొరవ తీసుకున్నప్పుడే అణగారిన వర్గాలు అభివృద్ధి బాటలో నడుస్తాయని, రాజంపేట డివిజన్‌లో ఐఎస్ స్థాయిలో బాధ్యతలు స్వీకరించిన వైఖోమ్ నిధియా దేవి దళితుల సమస్యలు పరిష్కరించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. సానుకూలంగా స్పందించిన సబ్ కలెక్టర్ దళితుల సమస్యల పట్ల ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపి, దళితులకు సంబంధించి ఎటువంటి సమస్య ఉన్నా తమను నేరుగా కలిసి పరిష్కరించుకోవచ్చునని భరోసా కల్పించారు. కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు జడ శివ, ప్రధాన కార్యదర్శి మధు, బూడ్స్ హరి, వెంకటరమణ పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న మందా శ్రీనివాసులు

పాఠశాలల్లో డివైఇఒ ఆకస్మిక తనిఖీలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డివైఇఒ

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని పలు పాఠశాలలను సోమవారం డివైఇఒ పురుషోత్తం ఎంఇఒతో కలిసి పాఠశాలలు, హాస్టళ్లలో తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా ప్రభుత్వ బాలికల పాఠశాల, ప్రయివేటు పాఠశాలల్లో తనిఖీ నిర్వహించారు. పాఠశాలల్లో విద్యాబోధన, విద్యార్థులకు వసతి, హాస్టల్లో నిర్వహణలపై ఆరా తీశారు. కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, హాస్టల్ వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు, హాస్టల్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని పాఠశాల యాజమాన్యాలకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఓ ప్రయివేటు పాఠశాలలో ఓ విద్యార్థిపై ఉపాధ్యాయుడు చేయి చేసుకున్నాడని, దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాలని డివైఇఒకు ఎఐఎస్ఎఫ్ సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. విచారణ చేస్తామని డివైఇఒ వారికి హామీ ఇచ్చారు.

ఐటిఐలో మిగులు సీట్ల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని 3 ప్రభుత్వ, 12 ఐటిఐ కళాశాలల్లో మిగులు సీట్లు భర్తీకి ఈనెల 5వ తేదీ నుండి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ కన్వీనర్ కె.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26 దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరి తేదీ అని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు iti.ap.gov.in వెబ్ సైట్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ కూడా ప్రారంభమవడం చేత రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు సమీపంలోని ప్రభుత్వ ఐటిఐకి వెళ్లి సమర్పించిన దరఖాస్తులు పరిశీలన చేయించుకుని తగిన ధ్రువపత్రంతో ఈనెల 29వ తేదీన కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించుకొని అభ్యర్థుల పేర్లు మెరిట్ లిస్టులో కనబడవని, కాబట్టి అభ్యర్థులు తప్పనిసరిగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాల్సిందిగా తెలియజేశారు.

వైభవంగా కామేశ్వరి స్వామికి విశేష పూజలు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

స్థానిక కోనేటివీధిలోని శ్రీలక్ష్మీకామేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం మొదటి సోమవారంను పురస్కరించుకొని విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, షోడశ ఉపచార పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు గోనవరపు శీనా స్వామి శ్రావణమాస విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణి చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కువైట్ శంకరాచారి, భక్తులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయాలి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో పంటలు సాగు చేసిన రైతులు వివరాలను ఇ పంట యాప్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారి వై నాగమణి అన్నారు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం రైతు సేవ కేంద్రం ఇన్‌ఛార్జులు, విఆర్ఆర్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 12 రెవెన్యూ గ్రామాలలో విఆర్ఒల సహకారంతో రైతు సేవ కేంద్రం ఇన్‌ఛార్జులు ఫీల్డ్ లెవెల్‌లో పంట సాగుచేసిన ప్రతి రైతు వివరాలు ఈ పంట యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు మండలంలోని 12 రెవెన్యూ గ్రామాలలో 9 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని చెప్పారు. ఈ గ్రామాలలో ముందుగా విఆర్ఒ జాయింట్ ఎల్‌పి నెంబర్‌లో రైతు పంట విస్తీర్ణం, ఖాతా వారిగా వారి లాగిన్‌లో అప్ లోడ్ చేయాలన్నారు. ఈ పంట యాప్ గురించి విఆర్ఒలకు రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జులకు అవగాహన కల్పించారు సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ సిద్ధార్థ రాయల్, ఎఎస్ఒ నాగార్జున, ఎఇఒ కవిత, రైతు సేవ కేంద్రం ఇన్‌ఛార్జులు, విఆర్ఒలు పాల్గొన్నారు.

వైవీయూ పీజీ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ 4వ సెమిస్టర్ ఫలితాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె .కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథ్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్.ఈశ్వర్ రెడ్డి విడుదల చేశారు. పీజీ కోర్సులైన సైకాలజీ, మైక్రోబయాలజీ, మ్యాథమ్యాటిక్స్, జియాలజీ, ఫుడ్ టెక్నాలజీ, జువాలజీ, మైక్రోబయాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్సు , బోటనీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎంపీఈడీ సబ్జెక్టులలో ఉత్తమ ఫలితాలు లభించాయన్నారు. త్వరితగతిన ఫలితాలు విడుదల చేసిన పరీక్షల విభాగాన్ని విసి అభినందించారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారులు డాక్టర్ మమత డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ వెంకట్రామ్ పాల్గొన్నారు.

రచయిత బొమ్మిశెట్టికి పుస్తకం అందజేత

ప్రజాశక్తి - చాపాడు

రచయిత, చరిత్ర పరిశోధకులు బొమిశెట్టి రమేష్‌కు ప్రముఖ రచయిత పాలగిరి విశ్వప్రసాద్ రెడ్డి సంపాదకత్వం వహించిన కీర్తిశేషులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డిపై వచ్చిన కేతు తలపులలో పుస్తకాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మిశెట్టి రమేష్ మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి ఎంతో గొప్ప వ్యక్తి అని, అలాంటి సాహితీవేత్త, రచయితకు సంబంధించిన పుస్తకాన్ని అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

గండి పవిత్రతను కాపాడండి

ప్రజాశక్తి - వేంపల్లె

పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి ఆలయ పవిత్రతను జిల్లా ఉన్నతాధికారులు కాపాడాలని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, గండి దేవస్థానం మాజీ చైర్మన్ వడ్లకుంట రాజారావు పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గండిలో జరిగే శ్రావణ మాస వారోత్సవాలు సందర్భంగా వేసిన ఆహ్వాన పత్రికలను గండి ఇఒ ముద్రించారని తెలిపారు. ఆ ఆహ్వానపత్రికల్లో సిఎం చంద్రబాబు, దేవా దాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఫొటోలు ముద్రించకపోవడం దారుణమన్నారు. ఇఒ, ఆలయ ప్రధాన అర్చకులు నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గండి దేవస్థానానికి మంచి అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామన్నారు. అర్చకులను ఇతర దేవాలయాలకు మార్చాలని కోరారు. గండి దేవస్థానంలో అర్చకులు చెప్పిందే వేదంగా మారిందని చెప్పారు. హారతి పళ్లెం డబ్బులను హుండీలో వేయాలని జిఒ ఉన్నప్పటికీ అమలుకావడంలేదన్నారు. గండి దేవ స్థానాన్ని సొంత ఆస్తిలా అర్చకులు భావిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో టిడిపి నేతలు పాపిరెడ్డి శ్రీనువాసులు పాల్గొన్నారు.

సిఎం రాయలసీమ సమస్యలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాయలసీమ వాసి అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ ప్రాంత సమస్యలపై దృష్టి పెట్టాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి సూచించారు. వేంపల్లెలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకనాడు రతనాల సీమగా పేరుగాంచిన రాయలసీమ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో రాళ్ల సీమగా మారిందన్నారు. రాయలసీమకు నవమోసాలు జరిగినట్లు తెలిపారు. అమరావతిపై చూపుతున్న శ్రద్ధలో కనీసం పదవ వంతైనా సీమపై పెట్టాలన్నారు. విభజన చట్టంలో సెక్షన్ 46 ప్రకారం రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్‌ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద కేంద్రం రూ.24,350 కోట్ల నిధులు ఇవ్వాలన్నారు. కానీ ఇప్పటి వరకు కేవలం రూ.1,050 కోట్లు ఇచ్చిందని చెప్పారు. మిగిలిన నిధులు తెప్పించి సీమను అభివృద్ధి చేయాలని కోరారు.

విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - మైదుకూరు

విద్యుత్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సబంధిత సమస్యలపై వెంటనే స్పందించి ప్రజలకు సమాచారం అందించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.భరణికృష్ణ ఆదేశించారు. స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయంలో సోమవారం డిఇఇ, ఎఇ, విద్యుత్ శాఖ అధి.కారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ 33కెవి, 11కెవి అంతరాయాలను వెంటనే పరిష్క రిం చాలన్నారు. ప్రతి అధికారీ ఫోన్‌కాల్స్‌లో అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్ వెంటనే స్పందించి, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలను పరిష్కరించకపోతే అధికారుల మీద క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్స్‌కు పరిష్కారం చూపాలన్నారు.


సిఐని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

సిఐ రామాంజనేయులుకు సన్మానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మన్నూరు నూతన సిఐగా బాధ్యతలు స్వీకరించిన డి.రామాంజనేయులును టిడిపి మండల ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ కుమార్ రాజు, సీనియర్ నాయకులు జి.వి.సుబ్బరాజు, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు హోలీ శివకుమార్, తెలుగు యువత పార్లమెంట్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సూర్యనారాయణ రాజు సోమవారం మన్నూరు పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు.

'నిర్లక్ష్యంగా మున్సిపల్ అధికారులు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మునిసిపల్ అధికారులకు నిర్లక్ష్యం తగదని జనసేన నాయకులు యల్లటూరు శివరామరాజు అన్నారు. పట్టణ పరిధిలోని రామ్ నగర్‌లో జనసేన నాయకులతో కలిసి సోమవారం ఆయన పర్యటించారు. గిరిజన కాలనీ మార్గంలో మురికి నీరు వర్షపు నీటితో కలిసి దుర్గంధం వెదజల్లుతోందని, అక్కడ పెద్ద గొయ్యి ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అక్కడి ప్రజలు తెలపడంతో ఆయన స్థానిక ప్రజలతో కలిసి వివరాలు తెలుసుకున్నారు. గడచిన ఆరు సంవత్సరాలుగా ఈ సమస్య ప్రజలను ఇబ్బంది పెడుతోందని, పలుమార్లు గత ఎమ్మెల్యేతో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం శూన్యమని ప్రజలు మొరపెట్టుకున్నట్లు శివరామరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడి సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో జనసైనికులతో కలిసి పురపాలక కార్యాలయంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సమ్మెట శివప్రసాద్, పత్తి నారాయణ, స్థానిక ప్రజలు పూర్ణప్రసాద్, సుదర్శన్, మోహన్ కుమార్, నాగరాజు, గణేష్, దశరథ, సాయికుమార్, బాలాజీ, లీలావతి, జ్యోతి, మంజుల పాల్గొన్నారు.


మురుగుతో నిండిన రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

క్రైం కార్నర్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆత్మహత్యాయత్నం చేసుకున్న మహిళలు

భర్త కోసం భార్యలు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె చంద్రకాలనీలో భర్త కోసం ఇద్దరు భార్యలు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చేరారు. సోమవారం జరిగిన ఘటనపై పోలీసుల కథనం మేరకు.. స్థానిక టమోటా మార్కెట్లో పనిచేసే రెడ్డిశేఖర్‌కు మొదటి భార్య దుర్గమ్మ ఉండగా లక్ష్మీ అనే మహిళను మరో వివాహం చేసుకున్నాడు. ఈ విషయమై ఇద్దరి భార్యలకు తెలిసి పోయి ఇద్దరూ మహిళలు నా భర్త అని ఒకరు కాదు నా భర్త అంటూ మరొకరు గొడవపడి విషంతాగారు. స్థానికులు బాధితులను జిల్లా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గాలివీడు

స్థానిక పంచాయతీ పేరాల గుట్ట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎం.ఆదినారాయణరెడ్డి(55) మృతి చెందాడు. వివరాలు.. తంబళ్లపల్లి దేవరెడ్డిపల్లికి చెందిన ఆదినారాయణరెడ్డి సోమవారం తన కుమార్తె ఇంటి వెళ్లి తిరిగి గాలివీడుకు బైక్‌మీద బయలుదేరాడు. పేరాల గుట్ట వద్దకు రాగానే మదనపల్లె నుంచి గాలివీడుకు వస్తున్న ఆర్‌టిసి బస్సు అదుపు తప్పి వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆదినారాయణరెడ్డికి మోకాళ్లు, తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య సరోజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొ న్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు అటవీశాఖ నిఘా విభాగం బృందం నిర్వహించిన దాడుల్లో రూ15,50,000లు విలువ చేసే 22 ఎర్రచందనం దుంగలు వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు డిఎఫ్ఒ జెవి సుబ్బారెడ్డి తెలిపారు. ఆదివారం తమ కార్యాలయానికి అందిన సమాచారం మేరకు తాను, తమ సిబ్బందితో కలిసి చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం, కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం తమకు సమీపంగా వచ్చిన అనుమానిత వాహనాన్ని ఆపమని సూచనలివ్వగా అది ఆగకుండా వేగంగా ముందుకు దూసుకు పోయిందన్నారు. అప్రమత్తమైన తాము ఆ వాహనాన్ని వెంబడించామని చెప్పారు. ఆ వాహన చోదకుడు బెంగళూరు-తిరుపతి మార్గంలోని చెర్లోపల్లి సమీపంలో కారు ఆపి డ్రైవరుతో సహా మరో వ్యక్తి దిగి పక్కనే ఉన్న మామిడి తోటలోకి చొరబడి చీకట్లో పరారయ్యారని చెప్పారు. నెంబరులేని టొయోటో ఇతియోస్ కారును తనిఖీ చేయగా అందులో వాహనంతో సహా రూ.15.50 లక్షలు విలువ చేసే 22 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. ఈ దాడుల్లో తనతో పాటు ఎఫ్ఆర్ఒ ఎన్.వెంకటరమణ, ఎఫ్ఎస్పి కె.ప్రతాప్, ఎఫ్‌బిఒ, ప్రొటెక్షన్ వాచర్లు నాగేంద్ర బాబు, వెంకటేష్, మల్లికార్జున పాల్గొన్నారు.


పట్టుబడిన ఎర్రచందనం దుంగలు, వాహనంతో పీలేరు నిఘా విభాగం బృందం